# ఓటింగ్ శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి



కళాజాత ప్రదర్శనల ద్వారా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు (ఫైల్)

- ఇప్పటికే జిల్లాలో ప్రారంభమైన ఓటరు సమాచార స్లిప్‌ల పంపిణీ
- ఓటింగ్ శాతం తక్కువ నమోదైన పోలింగ్ కేంద్రాల పరిధిలో కళాజాత
- గ్రామాల్లో ఓటు హక్కు వినియోగంపై ప్రచార ఫ్లెక్సీల ఏర్పాటు
- ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, అత్యవసర సర్వీసుల్లో ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం
- పర్యవేక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, నవంబర్ 23: తెలంగాణలో ఈ నెల 30న ఎన్నికలు జరుగనున్నందున జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఓటరు సమాచార స్లిప్పులను కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పంపిణీ ప్రక్రియ పూర్తి చేసేందుకు వీలుగా కలెక్టర్ అనురాగ్ జయంతి పర్యవేక్షణ చేస్తున్నారు. తమ బూత్ పరిధిలో బీఎల్‌వో ఓటరు స్లిప్‌ను నమోదిత ఓటరుకు లేదా ఓటరు కుటుంబంలోని వయోజన సభ్యుడికి అందజేస్తున్నారు. బీఎల్‌వో ఓటరు స్లిప్‌ను స్వీకరించినందుకు రసీదుగా, రిజిస్టర్‌లో ఓటరు స్లిప్ పంపిణీ చేసిన వ్యక్తి సంతకం లేదా బొటనవేలు ముద్రను తీసుకుంటున్నారు. ఓటరు స్లిప్‌తోపాటు సీ-విజిల్ పాంప్లెట్‌ను ఓటరుకు అందజేస్తున్నారు. ప్రతి కుటుంబానికి ఓటరు గైడ్‌ను కూడా అందజేస్తున్నారు. సెక్టార్ పరిధిలో ఓటరు స్లిప్‌లు ప్రతి ఓటరుకు అందేలా సెక్టార్ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

**ఓటింగ్ శాతం తక్కువ నమోదైన పోలింగ్ కేంద్రాల పరిధిలో కళాజాత ప్రదర్శనలు**

ఓటింగ్ శాతం తక్కువ నమోదైన పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లను చైతన్యం చేసేందుకు తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. పల్లెలతో పోల్చుకుంటే పట్టణాల్లోనే ఓటు నమోదు శాతం తక్కువగా ఉన్నందున ప్రధానంగా సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో కళాజాత ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నారు.

**సామాజిక మాధ్యమాల వేదికగా ప్రచారం**

యువకులను ఓటు వేసేలా చూసేందుకు సామాజిక మాధ్యమాలను జిల్లా యంత్రాంగం వేదికగా ఉపయోగించుకుంటుంద. ట్విట్టర్( ఎక్స్), ఫేస్‌బుక్, వాట్సాప్‌తోపాటు ఇతర సామాజిక మాధ్యమాల్లో ఓటుహక్కు ప్రాధాన్యత, వినియోగం గురించి తెలిపేలా ప్రత్యేకంగా వీడియోలు, పాటలు రూపొందించి ఓటర్లను చైతన్యం చేస్తున్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'ఓటేద్దాం... రండి'! అనే ఆడియో, వీడియో సీడీ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటుంది. డీపీఆర్‌వో వాట్సాప్ వేదికగా ఓటు హక్కు ప్రాధాన్యత, వినియోగం అంశంగా మీకు తెలుసా? అనే పేరుతో నిర్వహిస్తున్న వాట్సాప్ పోల్ ప్రాచుర్యం పొందింది.



జిల్లాలో ఏర్పాటు చేసిన స్వీప్, సీ-విజిల్ ఫ్లెక్సీ

**గ్రామాల్లో ఓటు హక్కు ప్రాధాన్యత ఫ్లెక్సీల ఏర్పాటు**

జిల్లాలోని 255 గ్రామపంచాయతీల్లో ఓటుహక్కు ప్రాధాన్యత తెలిపేలా జిల్లా యంత్రాంగం ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు అవగాహన కల్పిస్తున్నారు.

**దివ్యాంగుల ఓటుహక్కుకు ప్రత్యేక ఏర్పాట్లు**

జిల్లాలోని రెండు నియోజకవర్గాల పరిధిలో 547 పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, వృద్ధులు సులభంగా ఓటుహక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. ర్యాంప్, వీల్‌చైర్ సౌకర్యం కల్పించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు అసూర్డ్ మినిమమ్ ఫెసిలిటీస్‌ను అధికారులు కల్పిస్తున్నారు. ఓటింగ్ నమోదు శాతం పెంచడంపై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేక దృష్టి సారించి ఆ దిశగా పర్యవేక్షిస్తున్నారు.

**పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం**

40 శాతం, ఆపై వైకల్యం కలిగిన దివ్యాంగులు, 80 ఏళ్లకు పైబడిన ఓటర్లకు ప్రస్తుత శాసనసభ ఎన్నికల్లో తొలిసారిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని కల్పిస్తున్నారు. వీరితోపాటు పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ పలు విభాగాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే అవకాశం కల్పిస్తోంది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ రైల్వే, ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ), పౌరసరఫరాల శాఖ, బీఎస్ఎన్ఎల్, పోలింగ్ రోజు వార్తల సేకరణ కోసం ఎన్నికల సంఘం నుంచి పాస్ పొందిన జర్నలిస్టులు, అగ్నిమాపక శాఖ అధికారులు బ్యాలెట్ ఓటు వేయవచ్చు.

**ప్రత్యేక ఆకర్షణగా 'ఐ విల్ ఓట్' సెల్ఫీ స్టాండ్**

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రవేశ మార్గం ద్వారం వద్ద ఏర్పాటు చేసిన 'ఐ విల్ ఓట్' పేరుతో జిల్లా ఐఅండ్‌పీఆర్ ఏర్పాటు చేసిన సెల్ఫీ స్టాండ్ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఓటర్లు సెల్ఫీ స్టాండ్ వద్ద ఫొటోలు దిగుతూ ... మేము తప్పకుండా ఓటు వేస్తాము అంటూ సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు షేర్ చేస్తున్నారు.




కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఐ విల్ ఓట్ స్టాండ్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ (ఫైల్)



ఐవిల్ ఓట్ స్టాండ్‌లో డీపీఆర్‌వో దశరథం, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్(ఫైల్)

# మంత్రి కేటీఆర్‌కు వడ్డెర సంఘ సభ్యుల మద్దతు



సెస్ చైర్మన్ చిక్కాల రామారావుకు తీర్మానపత్రం అందజేస్తున్న వడ్డెర సంఘ సభ్యులు

సిరిసిల్ల రూరల్, నవంబర్ 23: సిరిసిల్ల అభ్యర్థి, మంత్రి కేటీఆర్‌కు తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలోని వడ్డెర సంఘ సభ్యులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ మేరకు గురువారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ప్రజాప్రతినిదులు, బీఆర్ఎస్ నేతలకు సదరు పత్రానిన అందజేశారు. ఈసందర్భంగా వారిని అభినందిస్తూ మంత్రి కేటీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ పూసపల్లి సరస్వతి, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాట్ల మధు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చెన్నమనేని వెంకట్రావు, సింగిల్ విండో చైర్మన్ కోడూరి భాస్కర్‌గౌడ్, ఆర్‌బీఎస్ మండలాధ్యక్షుడు కొమ్మెటి రాజిరెడ్డి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ పబ్బతి విజయేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సతీశ్‌రెడ్డి, అబ్బాడి అనిల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రామలక్ష్మి, అఫ్రోజ్, రామచంద్రం, సతీశ్‌గౌడ్ ఉన్నారు.

# అభిమానం చంపుకోక.. అసత్యాలు చెప్పలేక..

- గులాబీ గూటికి తిరిగివస్తున్న పార్టీ శ్రేణులు



బొప్పాపూర్‌లో సత్యానికి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 23: చిన్నచిన్న కారణాలతో కొందరు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. అయితే తల్లిలాంటి బీఆర్ఎస్ పార్టీపై అభిమానం చంపుకోక.. అసత్యాలు చెప్పలేక తిరిగి సొంతగూటికి చేరుతుండగా, హస్తం పార్టీ శ్రేణులు ఆగం అవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వెంకటాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేడిశెట్టి మల్లేశం, సింగారం గ్రామానికి చెందిన షేక్‌గౌస్, బొప్పాపూర్‌కు చెందిన లంబ సత్యం, నారాయణపూర్‌కు చెందిన ఒర్సు రాజేందర్‌కు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అంటే అభిమానంతో ఉన్నది. అయితే స్థానిక నేతల మధ్య సమన్వయ లోపం, చిన్నచిన్న కారణాలతో అసంతృప్తిగా ఉన్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు వారికి కాంగ్రెస్ కండువా కప్పి, నియోజకవర్గ స్థాయిలో ప్రచారం కల్పించుకునే ప్రయత్నం చేశారు. కానీ బీఆర్ఎస్ పార్టీ, ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఉన్న అభిమానాన్ని చంపుకోలేక ఒకటి, రెండు రోజుల్లోనే సొంత గూటికి చేరుకుంటున్నారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళ చెందుతున్నారు.

## ఈవీఎంల కమిషనింగ్ జాగ్రత్తగా చేపట్టాలి

కలెక్టరేట్, నవంబర్ 23: కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈవీఎంలపై సీరియల్ నంబర్లు, అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన చిహ్నాల ఏర్పాటు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. కమిషనింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి, ఈవీఎంల పని తీరు పరిశీలించాలన్నారు. రెండోవిడుత ర్యాండమైజేషన్‌లో కేటాయించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల నంబర్లను కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్‌లని ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించాలని సూచించారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్ నిర్వహణ తదితర అంశాల గురించి ఆర్‌వోలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ సిరిసిల్ల, వేములవాడ రిటర్నింగ్ అధికారులు ఆనంద్‌కుమార్, మధుసూదన్ ఉన్నారు.

## ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్

కలెక్టరేట్, నవంబర్ 23: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల విధుల్లో ఉండి ఇది వరకే ఫారం-12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న సిబ్బందికి ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉండి ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోని సిబ్బంది ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు సిరిసిల్ల, వేములవాడ తహసీల్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెలిసిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని కోరారు.

## బీజేపీ కార్యాలయంలో కుమ్ములాట



బీజేపీ కార్యాలయంలో గొడవ పడి బయటకు వస్తున్న కార్యకర్తలు

సిరిసిల్ల రూరల్, నవంబర్ 23: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ నేతలు గొడవ పడ్డారు. పార్టీ కార్యాలయంలో బూతు పైసల పంపకాల విషయంలో పలువురు నాయకులు తమ బూత్ పైసలు ఇవ్వాలని నిలదీయడంతో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ విషయం బయటకు రావడంతో పలువురు విలేకరులు అక్కడి వెళ్లగా, అంతర్గత సమావేశమని చెప్పి, పార్టీ కార్యాలయం మూసివేశారు. పలువురు నాయకులు గొడవపడడంతో వారి చొక్కాలు చినిగాయి. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా, మండలంలో చర్చానీయాంశమైంది.